క్లుప్తంగా

పులకించిన సత్రశాల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని పురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాసం మంగళవారం శివ నామస్మరణతో సత్రశాల పులకించిపోయింది. వివిధ స్వాముల మాలదారులకు, అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి పవిత్ర కృష్ణా నదిలో పుణ్య స్నానాలు చేసి, స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో గణపతి, రుద్ర హోమములు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. దేవస్థానంలో అన్నదానం కార్యక్రమానికి చేయుతనిచ్చిన దాతలను ఈట గాదె రామిరెడ్డి, దేవస్థానం అర్చకులు ఘనంగా సన్మానించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



పిడుగురాళ్ల: సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ముందుంటుందని అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు పేద విద్యార్థులకు మంగళవారం సైకిళ్లను అందించామన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీకి కంప్యూటర్‌ని అందజేసినట్లు చెప్పారు. సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



పిడుగురాళ్ల: రైతులకు ఎరువులు విక్రయించిన వెంటనే ఈ–పాస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని ఏవో ఎన్. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే అధికంగా ఎరువులు విక్రయిస్తే..చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు. ఎరువులను కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు అడిగి తీసుకోవాలని రైతులకు సూచించారు. స్టాక్ నిల్వలను, రికార్డులను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

క్రికెటర్ కోహ్లి జన్మదిన వేడుకలు



రెంటచింతల: భారత క్రికెటర్ విరాట్ కోహ్లి జన్మదిన వేడుకలను రెంటచింతలలో అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, మాట్లాడుతూ విరాట్ కోహ్లి తన కెరీర్‌లో మొత్తం 36 రికార్డులను నెలకొల్పి, కింగ్ ఆఫ్ క్రికెట్ బిరుదుతో వెలుగొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ రాయపురెడ్డి, వేముల దుర్గా ప్రపద్, వెంకటేశ్వర్లు, శ్రీను, సుదర్శన్, అజిత్, రాజు, జీవన్ ఉన్నారు.

విద్యార్థులకు అన్నదానం



గురజాల: భవిత పాఠశాల విద్యార్థులకు స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం మాట్లాడుతూ ప్రతివారం నిరుపేదలకు అందించేవారమని ఈ వారం విద్యార్థులకు అన్నదానం చేసినట్లు చెప్పారు. బండి రవికుమార్, పాఠశాల ఐఈఆర్టీ పి.విజయలక్ష్మి, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

సిబ్బంది లేక వెలవెల

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి గ్రామ సచివాలయంలో ఖాళీ కుర్చీలు ప్రజలకు దర్శనమిస్తున్నాయి. మంగళవారం సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో పనిపై వచ్చిన గ్రామస్తులు వెనుదిరిగి వెళ్లారు. సమాధానం చెప్పడానికి కూడా ఎవ్వరూ లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయుర్వేదం..దూరం

- డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యురాలు, అటెండర్
- 11 నెలల నుంచి వైద్యశాలకు తాళాలు
- పిచ్చిమొక్కలతో నిండిన ప్రాంగణం
- రోజూ వెనుదిరిగి వెళ్తున్న రోగులు



పిడుగురాళ్ల పట్టణం బ్రహ్మానందరెడ్డి కాలనీలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల



వైద్యశాల గేటుకు తాళం

పిడుగురాళ్ల: ఆయుర్వేద వైద్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. స్థానిక ఆయుర్వేద వైద్యశాలకు తాళాలు వేసి దీర్ఘకాలిక రోగులకు వైద్యాన్ని దూరం చేసింది. ఇది తెలియని రోగులు వైద్యశాలకు రావడం, తాళం వేసి ఉండటంతో వేచి చూడటం, ఇరుగు పొరుగు వారిని అడిగి సమాచారం తెలుసుకొని వెనుతిరగడం సాధారణమైంది.

అప్పుడు వెళ్లిన డాక్టర్..మళ్లీ రాలేదు..

పిడుగురాళ్ల పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాలనీలో పాత భవనంలో ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసింది. వైద్యశాల పాత భవనంతో పాటు స్థలాన్ని వైద్యశాలకు మున్సిపాలిటీ అప్పగించింది. హాస్పిటల్ నిర్మాణానికి కొంత నిధులు గత ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల నూతన భవన నిర్మాణం జరగలేదు. ఈ క్రమంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు మేఘమాలను డిప్యూటేషన్‌పై బెల్లంకొండకు పంపారు. ఇది జరిగి 11 నెలలు అవుతున్నా... పిడుగురాళ్ల పట్టణానికి మరో వైద్యులు రాలేదు. అటెండర్‌ను కూడా కోటనెమలిపురి గ్రామానికి డిప్యూటేషన్‌పై పంపారు. దీంతో పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మూతపడింది.

ఆయుర్వేదం..దూరం

పిడుగురాళ్ల పట్టణంలో ఇప్పటికే సుమారు లక్ష జనాభా ఉన్నారు. మండలంలోని 17 గ్రామాలతో పాటు ఉప గ్రామాలు కలిపి మరో 70 వేల మంది ఉంటారు. ఆయుర్వేద వైద్యశాలకు 50 నుంచి 70 మంది రోగులు వస్తుంటారు. ఉచితంగా మందులను పొందేవారు. సుమారు నెలకు రెండు వేల మంది వైద్య సేవలు పొందేవారు. ప్రస్తుతం వీరందరూ వైద్య సేవలు అందక నిరుత్సాహ పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎక్కువ జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఆయుర్వేద వైద్యశాలకు వైద్యులను, సిబ్బంది నియమించి, వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పొరుగూరు నుంచి కూడా రోగులు వస్తున్నారు



పొరుగూరు నుంచి కూడా వైద్యశాలకు రోగులు వస్తున్నారు. హాస్పిటల్‌కు తాళం వేసి ఉండటంతో వారికి నేనే డాక్టర్ లేడు అని చెబుతున్నాను. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. హాస్పిటల్ ఉంటే రోజు చాలా మంది రోగులు వైద్య సేవలు పొందేవారు. మాకు ఆరోగ్యం భాగలేక పోతే..వైద్యులు ఉచితంగా మందులు ఇచ్చేవారు.

– మొగిలి కన్నమ్మ, బ్రహ్మానందరెడ్డి కాలనీ, పిడుగురాళ్ల

వైద్యులను వెంటనే ఏర్పాటు చేయాలి



వెనుక బడిన ప్రాంతంలో ఉన్న హాస్పిటల్ మూత పడటంతో పేదలందరూ వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వైద్యులను కేటాయించి, హాస్పిటల్‌ను నడిపించాలి. భవన నిర్మాణానికి గత ప్రభుత్వం స్థలం కూడా కేటాయించింది.

– కాంద్రగుంట శ్రీనివాసరావు, 12 వార్డు కౌన్సిలర్, పిడుగురాళ్ల

పునీత అంతోని జీవితం ఆదర్శం



సమష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న విచారణ గురువులు

రెంటచింతల: ప్రేమజీవి పునీత అంతోనివారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తుమ్మకోట చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ పవిత్రన్(హెచ్‌జీఎన్)కోరారు. స్థానిక అంతోనివారి చర్చిలో నిర్వహిస్తున్న 9 మంగళ వారోత్సవాలను పురస్కరించుకుని కానుక మాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డితో కలసి ఆయన 3వ మంగళవారం సమష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా పవిత్రన్ భక్తులను ఉద్దేశించి అంతోనివారి త్యాగమయ జీవితంపై మాట్లాడారు. అంతోనివారు ఏసుక్రీస్తు సూక్తులను ఆచరించి దైవ ప్రేమ....సోదర ప్రేమ కలిగి ఉండాలని బోధనలు చేస్తూ తాను కూడ క్రీస్తు సువార్తను ప్రచారం చేయడం వలన పునీతుడయ్యారన్నారు. అంతోనివారి చర్చిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ పూజాబలిలో సహాయక గురువులు అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు నేడు ఆఖరు



మాట్లాడుతున్న తహసీల్దార్ వాణి

మాచర్ల రూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు బుధవారం ఆఖరి తేదీ అని తహసీల్దార్ బత్తుల వాణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుంటు వెంకట రమణ మంగళవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి వరకు నియోజకవర్గంలో 4,385 మంది ఓటర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దుర్గి మండలంలో 614, కారంపూడిలో 655, మాచర్లలో 1868, రెంటచింతల 753, వెల్దుర్తి మండలంలో 495 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

దుర్గి: మండలంలోని పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు..దరఖాస్తు గడువు బుధవారంతో ముగుస్తుందని తహసీల్దార్ ఐ.ఫణీంద్ర కుమార్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా తమ కార్యాలయంలో అర్జీలు అందించాలని తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు పండ్ల బళ్లను, షాపులను ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా పండ్లు నిగనిగలాడేలా కనిపించేందుకు అక్రమ పద్ధతులకు పాల్పడితే శాఖాపరమైన, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమితి కన్వీనర్ గోవిందరెడ్డి

మాచర్ల రూరల్: శ్రీ రామకృష్ణ సేవా సమితి నేతృత్వంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు సమితి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో 30 రోజుల పాటు కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వనున్నామని, 10వ తరగతి పాస్ /ఫెయిల్ అయిన విద్యార్థులూ ఈ శిక్షణ పొందవచ్చునని, వీటి కోసం కంప్యూటర్ నిపుణులు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 94400 06813, 93461 62835 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు విద్యార్థులకు జాగృతి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 4 పాఠశాలలు, మూడు కాలేజిలలో విద్యార్థులకు వీటి పై పోటీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎస్టీ హాస్టల్ తనిఖీ



హాస్టల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల దారి గుంతలుగా ఉండటంతో ఆ ప్రాంతంలో చిప్స్ తోలించి గుంతలను పూడ్చివేస్తామన్నారు. పక్కన శ్మశానంలో ఏపుగా మొక్కలు పెరగటంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. స్పందించిన కమిషన్ చెట్ల కొమ్మలను తొలగించి సమస్య లేకుండా చూస్తామన్నారు. విద్యార్థులకు గుడ్డుతోపాటు నాణ్యమైన భోజనం అందుతుందని విద్యార్థులు తెలపటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలు ధైర్యంగా ఉండండి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ నాయకులు అండగా ఉంటారని నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని తన కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... అధికార పార్టీకి చెందిన వారు పోలీసులను అడ్డుపెట్టుకొని సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. అలాగే గురజాల నియోజకర్గంలో కూడా కొంత మందిపై కేసులు నమోదు చేసి, భయపెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందుకే సోషల్ మీడియా కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తుందన్నారు. ఏ సమస్య వచ్చినా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అందుబాటులో ఉన్నారని తెలిపారు. కొన్ని సందర్భాలలో ఆయన అందుబాటులో లేని సమయంలో తనతోపాటు, వైఎస్సార్ సీపీ నాయకులందరూ అందుబాటులో ఉంటామన్నారు. ఎవరు అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. అలాగే మండలం , గ్రామాల్లో, సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. విమర్శించేటప్పుడు వ్యక్తిగతంగా కాకుండా ప్రభుత్వంపై, ప్రభుత్వ విధానాలపై గళమెత్తాలని సూచించారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, కార్యకర్తలకు ఏమైనా ఇబ్బందులు వస్తే లీగల్ సెల్‌తోపాటు సోషల్ మీడియా ఆర్గనైజేషన్ కూడా పని చేస్తుందన్నారు.. ఎటువంటి సందర్భంలోనైనా, ఏ ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంటామన్నారు.

ఆశ కార్యకర్తల ధర్నాను జయప్రదం చేయాలి



డాక్టర్ కవితకు వినతి పత్రం అందిస్తున్న పెండ్యాల మహేష్, ఆశ కార్యకర్తలు

సత్తెనపల్లి: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ పిలుపులో భాగంగా మంగళవారం పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ యూఎస్ఎల్ కవితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇటీవల అనేక మంది ఆశా కార్యకర్తలను రిటైర్మెంట్ చేశారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందడం లేదని, చనిపోయిన ఆశా కార్యకర్తలకు బీమా సౌకర్యం వర్తించడం లేదన్నారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్ పని చేయని సెల్ ఫోన్స్‌తో మెజారిటీ ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సెలవు కోసం అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధార పడవలసి వస్తుందన్నారు. కొత్త రికార్డ్స్ ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించాల్సి ఉండగా నేటి వరకు సరఫరా చేయలేదని, గ్రామాల్లో ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు షారోను, పద్మజ, రాధాకుమారి, మరియమ్మ, కమల, రుక్మిణి తదితరులు ఉన్నారు.

హాకీ జిల్లా జట్టుకు పెదకూరపాడు విద్యార్థులు

పెదకూరపాడు: అండర్–19 జిల్లా హాకీ జట్టుకు పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 4న నందిగామలో నిర్వహించిన అండర్–19 స్కూల్ గేమ్ జట్టుకి పెదకూరపాడు నుంచి ముగ్గురు బాలికలు, బాలురు ఒకరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 16 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులు చక్కగా రాణించి గుంటూరు జిల్లా జట్టుకి మంచి పేరు తేవాలని హెచ్ఎం అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



పాలు పోస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు



సత్రశాల దేవస్థానం సమీపంలో నాగమయ్యస్వామికి పూజలు

రెంటచింతల: నాగుల చవితి వేడుకలను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసంలో దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తిక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగ అంటారని సత్రశాల దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ తెలిపారు. నాగుల చవితిరోజున శివభావంతో అర్చిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని పూర్వీకుల నమ్మకమన్నారు. వివిధ గ్రామాల్లో ఉన్న పుట్టల వద్ద అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని పుట్టలలో పాలు పోసి, పూజలు చేశారు.

విజయపురిసౌత్: నాగుల చవితి వేడుకలను విజయపురిసౌత్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్, డౌన్ మార్కెట్, సాగర్ క్యాంపు ప్రాంతాల్లో నాగేంద్ర స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అంబేడ్కర్ సెంటర్‌లోని నాగేంద్ర స్వామి ఆలయం ధర్మకర్త వెంకన్న ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దాచేపల్లి: నాగుల చవితి పండుగ సందర్భంగా నారాయణపురంలోని నాగేంద్రస్వామి దేవాలయానికి భక్తులు పొటెత్తారు. దేవాలయంలో దీపారాధన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలుపోసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

పిడుగురాళ్ల: తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న నాగుల దేవస్థానంలో భక్తులు మంగళవారం పూజలు చేశారు. పుట్టలో మహిళలు పాలు పోసేందుకు బారులు తీరారు.

గురజాల: శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం వేకువ జాము నుంచి పట్టణంలోని అమరలింగేశ్వర స్వామి, ఇష్టకామేశ్వర స్వామి, గురజాలమ్మ తల్లి ఆలయాల వద్ద పుట్టల్లో మహిళలు పాలు పోసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



డౌన్ మార్కెట్ వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



అమరలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పాలు పొసేందుకు బారులు తీరిన మహిళా భక్తులు

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, తల్లిదండ్రులు

దుర్గి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీచర్స్, తల్లిదండ్రుల సమావేశాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి నీలావతి, ఎజీఎంసీ అకాడమిక్ గైడెన్స్ మ్యానటరింగ్ సెల్ అధికారి బాల సుబ్బారెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థుల ఉత్తీర్ణతతో పాటు పోటీ పరీక్షలలో విద్యార్థులు పాటించాల్సిన విషయాలపై చర్చించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల రికార్డ్స్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.వేణు, లెక్చరర్లు విద్యార్థుల చదువు పై తీసుకుంటున్న ప్రత్యేక చర్యల పట్ల అధికారులు అభినందించారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలలో గత సంవత్సరం కంటే ఈ అకడమిక్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు, సిబ్బంది ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు.

హెచ్ఐవీ, అంటువ్యాధులపై అవగాహన తప్పనిసరి

సత్తెనపల్లి: హెచ్ఐవీ, అంటువ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వర అన్నారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు, ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు న్యాకో(ఎన్ఏసీఓ) నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్ర స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం పణిదం పీహెచ్‌సీలో చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీము, అడ్వకసీ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వర మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పనిచేస్తున్నామని, ఈ ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ ద్వారా పల్నాడు జిల్లాలోని 55 గ్రామాలలో 8 వారాల పాటు హెచ్ఐవీ, టీబీ సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు, ఐఈసీ మెటీరియల్స్, ఫ్రీ కండోమ్ డిస్ట్రిబ్యూషన్, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీ కవిత హెచ్ఐవీ ఎలా వస్తుంది, టీబీ, సుఖవ్యాధులు, హెచ్ఐవీ పరీక్ష ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ జనం భయపడవలసిన పనిలేదని మంచి భోజనం తీసుకుంటూ ఏఆర్‌టీ మందులు వాడాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, లింక్ వర్కర్‌లు పాల్గొన్నారు.

పత్తి విక్రయానికి రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి

సత్తెనపల్లి: సీసీఐలో పత్తి విక్రయానికి రైతు సేవా కేంద్రంలో రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ళ, కంకణాలపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2024–25 సీజన్‌కి పత్తి పంట కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందన్నారు. ఖరీఫ్–2024 సీజన్‌లో ఈ–పంట ద్వారా పత్తి పంట సాగుకు నమోదు చేసుకున్న రైతులు సేవా కేంద్రంలో సీసీఐ ద్వారా పత్తి అమ్ముకొనుటకు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సీసీఐ ద్వారా పత్తి అమ్మదలచిన రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పత్తిలో తేమ 8 –12 శాతం వరకు మాత్రమే ఉండాలన్నారు. రైతులు బోరాలుగా కాకుండా పత్తిని లూజు పద్ధతిలో కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని రావాలన్నారు. ప్లాస్టిక్ సంచులలో తీసుకొని వచ్చినట్లయితే కొనుగోలు చేయరన్నారు. బ్యాంక్ ఖాతాల్లోనే నగదు జమ చేయటం జరుగుతుందన్నారు. పులువురు రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



రైతులతో మాట్లాడుతున్న ఏవో సంధ్యారాణి

గురజాల రూరల్: మండల పరిధిలోని గోగులపాడు, పల్లెగుంత గ్రామాల్లో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణీ మాట్లాడుతూ వ్యవసాయంలో మేలైన కొత్త యాజమాన్య పద్ధతులను రైతులకు ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.